بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 01.02.2019 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బద్రి అనుచరులైన హజ్రత్ అబూహుజైఫా బిన్ ఉత్బ రజియల్లాహు తఆలా అన్హు సద్గుణముల విశ్వాసభరిత, ఆసక్తికర ప్రస్తావన

### *హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 01.02.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి. నేడు నేను హజ్రత్ అబూ హుజైఫా బిన్ ఉత్బ నామము గల అనుచరుల గురించి ప్రస్తావింతును. వారు చాలా పొడుగైన, అందమైన ముఖము కలిగివుండిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం దారె అర్ఖమ్‌నకు మారక ముందే ఇస్లాంను స్వీకరించిరి. ఆరంభములోనే విశ్వసించినవారిలో వీరొకరు. ఈ విషయము ను ప్రస్తావించుచు హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లు వ్రాసిరి. అబూ హుజైఫా బిన్ ఉత్బ బనూ ఉమయ్యాహ్ వర్గమునకు చెందినవారు. ఉత్బ బిన్ రబీఅ నామము గల వారి తండ్రి ఖురైష్ నాయకులలో ఒకరు. హజ్రత్ అబూ హుజైఫా ఎబిసీనియా వైపు రెండు సార్లు ప్రస్థానము చేసిరి. వారి సతీమణి హజ్రత్ సహ్లా బిన్తె సుహైల్ కూడ వారితో పాటు ప్రస్థానము చేసిరి. ముస్లిముల బాధలు అధికమై, ఖురైష్ హింసాత్మక చర్యలలో హద్దులు దాటినప్పుడు ఎబిసీనియా వైపు వలస పోవలెనని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముస్లిములకు సూచించిరి. ఎబిసీనియా చక్రవర్తి నిజాయితిపరుడైనందున అతని ప్రభుత్వములో ఎవరు దౌర్జన్యమునకు గురి కారని కూడ వారు తెలపిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిన తర్వాత నబ్వీ 5వ సం॥లో 11 పురుషులు, నలుగురు మహిళలు ఎబిసీనియా వైపు వలస వెళ్లినప్పుడు వారిలో నేను ప్రస్తావించుచున్న హజ్రత్ అబూ హుజైఫా కూడ పాల్గొనిరి. ఈ వలసదారులు దక్షిణము వైపున ప్రయాణించుచు ఆ కాలములో అరబ్ ఓడ రేవు అయిన షుయాబా ప్రాంతమునకు చేరినప్పుడు అల్లాహ్ తఆలా కృపానుసారము ఎబిసీనియాకు ప్రయాణమయ్యే ఒక ఓడ సిద్ధముగా యున్నది వీరికి లభించెను. కావున అందులో వారు సవారైరి. ఎబిసీనియా చేరిన తర్వాత వీరికి శాంతియుత జీవితము లభించినది. అల్లాహ్ తఆలా దయానుగ్రహముతో ఖురైష్‌ల హింసల నుండి విముక్తి లభించెను. కాని కొందరు చరిత్రకారులు వ్రాసినట్లు ఈ వలసదారులు ఎబిసీనియా చేరుకొన్న అతి కొద్ది కాలములోనే ఖురైష్‌లందరు ఇస్లాంలో చేరినారు, కావున మక్కాలో పూర్తిగా శాంతి వాతావరణము ఏర్పడినదనే అసత్య సమాచారము వారికి అందినది. ఈ సమాచారము ఫలితముగా అధిక ముస్లిములు అనాలోచితంగా తిరిగి వచ్చేసిరి.

కాని మక్కా సమీపమునకు చేరిన తర్వాత వారికి వాస్తవము తెలిసినది. అప్పుడు శక్తిమంతులైన ఖురైష్ నాయకుని సంరక్షణలో కొందరు మక్కాలో ప్రవేశించగా మరి కొందరు రహస్యముగా తిరిగి వెళ్లిపోయిరి. నిజము అల్లాహ్‌యే బాగుగా ఎరుగును. ఎబిసీనియా నుండి తిరిగి వచ్చిన అధిక వలసదారులు కూడ మరల తిరిగి వెళ్లిపోయిరి. ఖురైష్ రోజు రోజుకు హింసాత్మక చర్యలలో రెచ్చిపోతున్నందున, వారిచే దౌర్జన్యములు అధికగముచున్న తరుణంలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము మేరకు ఇతర ముస్లిములు కూడ రహస్యముగా వలసకు సన్నాహాలు చేసుకొని, అవకాశము లభించగానే వలస పోయిరి. ఈ వలసల పర్వం ఎంతగా పెరిగినదనగా వలస దారుల సంఖ్య వందకు చేరినది. వీరిలో 18 మహిళలు కూడ యుండిరి. ఫలితంగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట మక్కాలో అతి కొద్ది ముస్లిములు మాత్రమే మిగిలియుండిరి. ఈ వలసను కొందరు చరిత్రకారులు ఎబిసీనియా ద్వితీయ వలస అని కూడ అంటారు. మదీనాకు ప్రస్థానము చేసే అనుమతి లభించినప్పుడు హజ్రత్ హుజైఫా, వారిచే స్వతంత్ర్యము పొందిన బానిస హజ్రత్ సాలిమ్ ఇద్దరు మదీనాకు వలసపోయిరి. వారు ప్రస్థానము చేసిన తర్వాత మదీనాలో హజ్రత్ ఇబాద్ బిన్ బషీర్ గృహములో బస చేసిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూహుజైఫా – హజ్రత్ ఇబాద్ బిన్ బషీర్ మధ్య సోదరభావము ఏర్పాటు చేసిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జహష్ యుద్ధములో హజ్రత్ అబూహుజైఫా కూడ పాల్గొనిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్

జహ్‌ష్ యుద్ధ వివరములు ఇట్లు గలవు. కర్జ్ బిన్ జాబిర్ ఫిహ్రీ నామము గల మాక్కాకు చెందిన ఒక నాయకుడు ఖురైష్‌ల ఒక బృందము ద్వారా అతి తెలివితో మదీనా నగరము నుండి కేవలం మూడు మైళ్ల దూరములో వున్న పశువుల కంచెపై అకస్మాత్తుగా దాడి చేసి ముస్లిములు ఒంటెలు, పశువులను దొంగలించుకొని పారిపోయెను. ఈ విషయము ఆంహ్‌జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియగానే జైద్ బిన్ హారిసాను మదీనాకు అధ్యక్షునిగా నియమించి వలసదారుల ఒక బృందమును తీసుకొని అతణ్ణి పట్టుకొనుటకు బయలు దేరిరి. బదర్ సమీపములో గల సఫ్వాన్ ప్రాంతమునకు వెళ్లినా అతడు పట్టుబడలేదు. ఈ యుద్ధమును మొదటి బదర్ యుద్ధము అని కూడ అంటారు. కర్జ్ బిన్ జాబిర్ చేసిన ఈ దాడి సాధారణంగా గ్రామీణులు చేసే దొంగతనము మాత్రమే కాదు. అతడు ఖురైష్‌ల తరపున ప్రత్యేక సంకల్పముతో వచ్చియుండవచ్చును. ఆంహ్‌జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు నష్టము కలిగించే ఉద్ధేశము కూడ కలిగి వుండవచ్చును. కాని ముస్లిములు జాగ్రత్తగా వున్నందున ఒంటెలను దొంగలించుకొని తిరిగి పోయెను. మదీనాపై దాడులు చేసి ముస్లిములను అంతము చేయాలని మక్కా ఖురైష్‌లు భావించినారని కూడ ఈ వి షయముతో తెలిసిపోతుంది. కర్జ్ బిన్ జాబిర్ ఆకస్మిక దాడి వలన ముస్లిములు చాలా భయాందోళనకు గురైరి. మేము మదీనాపై దాడి చేసి ముస్లిములను అంతమొందిస్తామని ఖురైష్ నాయకులు ఇంతకు ముందే హెచ్చరించినందున ముస్లిములు తీవ్ర ఆందోళన చెందిరి. ఈ ప్రమాదకర విషయముల వలన ఖురైష్‌ల కదలికలను అతి సమీపంగా తెలుసుకోవాలని ఆంహ్‌జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంకల్పించిరి. కావున ఇందుకు వారు 8 మందితో కూడిన వలసదారుల ఒక బృందమును సిద్ధము చేసిరి. ఖురైష్‌ల రహస్య సంకల్పముల గురించి సులభంగా తెలుసుకొనుటకు వారెంతో చాకచక్యంగా ఖురైష్‌లోని వివిధ వర్గములకు చెందిన వారిని ఇందులో సభ్యులుగా చేర్చిరి. తమ అత్తమ్మ వరుస సోదరుణ్ణి ఈ బృందమునకు అధ్యక్షునిగా నియమించిరి. ఇందులో హుజైఫ బిన్ ఉత్బ కూడ యుండిరి.

మదీనా నుండి రెండు రోజులు ప్రయాణము చేసిన తర్వాత ఆంహ్‌జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచన మేరకు ఎనిమిది మందితో కూడిన ఈ బృందము మక్కా–తాయిఫ్ మధ్య గల నఖ్ల లోయ వైపు పయణమైనది. మార్గమధ్యలో సాద్ బిన్ అబి వఖ్ఖాస్, ఉత్బ బిన్ ఘజ్వాన్ ఒంటె తప్పిపోయినది. కావున వారు దానిని అన్వేషించుచు తమ సహచరులతో విడిపోయిరి. చాలా వెతికినను వారిని పొందలేదు. ఇలా ఈ బృందములో కేవలం ఆరుగురు మిగిపోయిరి. ముస్లిముల ఈ చిన్న జమాఅత్ నఖ్ల చేరుకొని తమ పనిలో నిమగ్నమైనది. ఈ విషయము ఎవరికి తెలియకూడదనే ఉద్ధేశంతో, వీరు కూడ ఉమ్రాకు వచ్చినారని ప్రయాణికులు భావించవలెనని వీరిలోని కొందరు తల వెంట్రుకలు తీసి వేసిరి. వీరు అక్కడికి చేరుకొన్న కొద్ది రోజులలోనే ఖురైష్‌ల ఒక చిన్న బృందము అక్కడికి చేరుకున్నది. అది తాయిఫ్ నుండి మక్కాకు వెళ్లుచుండెను. రెండు బృందములు ఎదురెదురుగా తారసపడినవి. వీరు ముస్లిములని తెలిసినందున వారు యుద్ధము చేయుటకు ఉపక్రమించిరి. ఇప్పుడేమి చేయాలని ముస్లిములు పరస్పరం సలహా చేసుకొనిరి. ఎందుకనగా ఆంహ్‌జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం రహస్య సమాచారము సేకరించాలని పంపగా ఇక్కడ ఖురైష్‌లు యుద్ధము ప్రారంభించిరి. రెండు పక్షములు ఎదురెదురుగా సిద్ధమైనవి. ఈ ఖురైష్ బృందము ఇప్పుడు ముస్లిములను చూచినందున ఈ రహస్యము పటాపంచలైపోవుననే భయము కూడ యుండెను. యుద్ధ నిషేధము గల నెలలో ఇది చివరి నెల అని కూడ ముస్లిములకు ఆలోచన కలుగుచుండెను. అరబ్ ప్రాచీన ఆచారము ప్రకారము ఇందులో యుద్ధము నిషేధము. నిషేధిత ప్రాంత సరిహద్దులో ఈ నఖ్ల అనే ప్రాంతముండెను. ఈ బృందముపై దాడి చేసి వీరిని బంధించాలి లేదా హత్య చేయాలని బృందములో గల ఆరుగురు ముస్లిములు ఒక అభిప్రాయానికి వచ్చిరి. కావున వారు అల్లాహ్ నామముతో దాడి చేసిరి. ఫలితంగా అవిశ్వాసులలోని ఒకరు అమర్ బిన్ అల్‌హ్‌జ్రమి హతమయ్యెను. ఇద్దరు బంధించబడిరి. కాని నాలుగవ వ్యక్తి పారిపోయెను. ముస్లిములు అతణ్ణి పట్టుకోలేక పోయిరి. అవిశ్వాసులను బంధించాలని లేదా హతమార్చాలనే ప్రణాళిక పూర్తి కాలేక పోయెను. అనంతరం ముస్లిములు అవిశ్వాసుల సామాగ్రిని వశపరచుకొనిరి. ఖురైష్‌లోని ఒక వ్యక్తి పారిపోయినందున త్వరలోనే ఈ యుద్ధము గురించి వార్త మక్కాకు చేరుననే నమ్మకమున్నందున అబ్దుల్లాహ్ బిన్ జహ్‌ష్, అతని సహచరులు యుద్ధ సామాగ్రితో సహా వేగంగా మదీనాకు తిరిగి వచ్చిరి.

అనుచరులు బృందముపై దాడి చేసినారనే విషయము ఆంహ్‌జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియగా

తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరచిరి. పవిత్ర మాసములో యుద్ధము చేయుటకు నేను మీకు అనుమతి ఇవ్వలేదు. అనంతరం విపక్ష యుద్ధ సామాగ్రిలోని ఏమియును తీసుకొనుటకు వారు నిరాకరించిరి. ఫలితంగా అబ్దుల్లాహ్, వారి సహచరులు తీవ్ర పశ్చత్తాపానికి గురైరి. మేము అల్లాహ్, అతని ప్రవక్త అసంతృప్తి వలన నాశనమైనామని వారు భావించిరి. మరో వైపు ముస్లిములు పవిత్ర మాస పవిత్రత నియమమును ఉల్లఘించినారని ఖురైష్ కూడ అల్లరి చేసిరి. పవిత్ర ఖుర్ఆన్ సూక్తి అవతరించినందున ముస్లిములకు ఉపశమనం కలిగెను.

చరిత్ర ద్వారా రుజువైనదేమనగా ఇస్లాంనకు విరుద్ధముగా ఖురైష్ నాయకులు తమ రక్తపాత చర్యలను పవిత్ర మాసములలో కూడ కొనసాగించేవారు. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా అవతరింపజేసిన సూక్తి వలన ముస్లిములకు సంతృప్తి కలిగెను. అనంతరం ఖురైష్ కూడ కొంత చల్లబడిరి. బంధించబడిన ఇద్దరు అవిశ్వాస ఖైదీలను పరిహారము తీసుకొని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విడుదల చేసిరి. ఈ ఇద్దరిలో ఒక వ్యక్తిపై ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సద్గుణములు, ఇస్లాం బోధన సత్యము ఎంత ప్రభావితము చూపెననగా అతడు స్వతంత్రత పొందిన తర్వాత కూడ తిరిగి వెళ్లిపోవుటకు నిరాకరించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హస్తమున బైఅత్ చేసి ఇస్లాంలో చేరిపోయెను. అనంతరం బిరె మవూనలో అమరుడయ్యెను. అతని పేరు హకమ్ బిన్ ఖైసాన్. హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ అబూ హుజైఫా గురించి మరో కథనము ఇట్లు కూడ గలదు. బదర్ యుద్ధము రోజున వారు తమ తండ్రికి ఎదురు పడిరి. ఎందుకనగా వారి తండ్రి ఇస్లాంలో చేరలేదు. అవిశ్వాసులతో కలిసి వచ్చిరి. నబీ సల్లల్లాహు అలైహి వసల్లం అలా చేయకూడదని నివారించిరి. అతణ్ణి విడిచి పెట్టుము ఎవరో మరొకరు అతణ్ణి హతమార్చును. వారి తండ్రి, చిన్నాన, సోదరుని కొడుకు ముగ్గురు హతమైరి. హజ్రత్ అబూ హుజైఫా చాలా సహనము పాటించిరి. అల్లాహ్ తఆలా ఇష్టమునే ఇష్టపడి అల్లాహ్ తఆలా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు సహకరించి అందించిన విజయము పట్ల కృతజ్ఞత తెలిపిరి. ఈ సంఘటన గురించి మరో కథనము కూడ లభించును. ఇబ్నె అబ్బాస్ ఇట్లు ఉల్లేఖించిరి. బదర్ యుద్ధము రోజున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. మీలోని ఎవరికైనా అబ్బాస్ తారసపడినచో అతణ్ణి హత్య చేయకుము. ఎందుకనగా వారు విధి లేక బయలే దేరినారు. వారిని హత్య చేయకుండా బంధించగలరు. ఈ విషయము హజ్రత్ అబూహుజైఫాకు తెలువగా తమ సహచరునితో ఇట్లనిరి. మేము మా తండ్రులను, సోదరులను, బంధువులను హతమార్చాలి కాని అబ్బాస్‌ను విడిచి పెట్టవలెనా? ఇదెక్కడి న్యాయము. అల్లాహ్ ప్రమాణము! నాకు ఎదురుపడినచో నేను తప్పక వారిని హతమార్చెదను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఈ విషయము తెలియగా హజ్రత్ ఉమర్‌తో ఇట్లనిరి. ఓ అబా హాఫజ్! ఓ అబా హాఫజ్! దైవ ప్రవక్త చిన్నాన ముఖముపై ఖడ్గముతో దాడి జరుగునా. హజ్రత్ ఉమర్ ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్తా! అతణ్ణి హతమార్చుటకు నాకు అనుమతివ్వండి. అల్లాహ్ ప్రమాణముగా అతనిలో దాంబికము యున్నది. ఇలా చేయకూడదని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. హజ్రత్ హుజైఫా ఇట్లనేవారు. నేను ఆ రోజు చెప్పిన విషయము వలన అమరత్వము పొందితె తప్ప నేను మోక్షము పొందలేను. వారు యమామ యుద్ధములో అమరులైనారని కథకుడు తెలిపెను.

హజ్రత్ ఆయిషా ఇట్లు ఉల్లేఖించిరి. అన్యారాధకుల హతులను ఒక బొందలో పడేయాలని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. అప్పుడు హజ్రత్ అబూ హుజైఫా ముఖములో అసంతృప్తి కనిపించుచుండెను. ఎందుకనగా వారి తండ్రిని కూడ ఒక బావిలో పడవేయబడుచుండెను. వారు సల్లం వారితో ఇట్లనిరి. ఓ అబూ హుజైఫా! అల్లాహ్ ప్రమాణముగా! నీ తండ్రితో జరుగుచున్న వ్యవహారము నీకు నచ్చడం లేదని తెలుస్తున్నది. హజ్రత్ అబూ హుజైఫా ఇట్లు వేడుకొనిరి. అల్లాహ్ ప్రమాణముగా! నాకు అల్లాహ్, అతని ప్రవక్త పట్ల ఎలాంటి అనుమానం లేదు. కాని నా తండ్రి సహనశీలుడు, సత్యవంతుడు, మంచి సలహాలు ఇవ్వగలిగే వ్యక్తి. అతనిలో ఎలాంటి దురుద్దేశము లేకుండెను. కాని సంభవించిన అతని ఈ మరణ తీరు నన్ను బాధకు గురి చేసెను. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూహుజైఫా మేలు కొరకు ప్రార్థన చేసిరి. హజ్రత్ అబూహుజైఫా అన్ని యుద్ధములలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొను అనుగ్రహము పొందిరి. హజ్రత్ అబుబకర్ సిద్దీఖ్ ఖిలాఫత్ హయాంలో యమామ యుద్ధములో 53 లేదా 54 సం॥ల వయసులో అమరులైరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మన జమాఅత్‌నకు సుదీర్ఘ కాలము వరకు సేవలందించిన పెద్దలు ప్రొఫెసర్ సవూద్ అహ్మద్ ఖాన్ ఢిల్లీ గురించి ఇప్పుడు నేను ప్రస్తావించెదను. వారు కొద్ది రోజుల క్రితం అనగా 21 జనవరి తేదీన మృతి చెందినారు. اناللهوانااليهراجعون۔ వారి తండ్రి హజ్రత్ హసన్ ఇహ్‌సాన్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు. వారి తాత (తండ్రి తరపున) హజ్రత్ మహ్‌మూద్ హసన్ ఖాన్ గారు పట్యాలా ఉపాధ్యాయులు కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన 313 అనుచరుల పట్టికలో 301వ నంబరులో వీరి పేరును ప్రస్తావించిరి. ప్రొఫెసర్ సవూద్ ఖాన్ గారి తండ్రి హజ్రత్ హసన్ ఇహ్‌సాన్ ఢిల్లీ గారు 10, 12 సం॥ల వయసులో ఖుత్బా ఇల్హామియా సందర్భమున ఖాదియాన్ వెళ్లి ఈ మహా గొప్ప సంకేతమును తిలకించే అనుగ్రహము పొందిరి. ప్రొఫెసర్ సవూద్ ఖాన్ గారు ఏప్రిల్ 1945 సం॥లో తమను సమర్పించిరి. వారు అలీఘఢ్ నుండి బి.ఏ.ఆనర్స్ చేసిరి. వారితో పాటు వారి సోదరుల సమర్పణను ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు 1955 సం॥లో ఒక ఖుత్బా జుమాలో ఇట్లనిరి. నా దృష్టిలో మాస్టర్ ముహమ్మద్ హసన్ ఇహ్‌సాన్ గారు ప్రశంసించదగ్గ ఆదర్శము చూపిరి. వారొక సాధారణ ఉపాధ్యాయులు. నిరు పేద వ్యక్తి. వారు ఆకలి భరించి తమ పిల్లలను చదివించిరి. పట్టభద్రులుగా చేసిరి. ఏడుగురు కుమారులలోని నలుగురిని జమాఅత్ కొరకు సమర్పించిరి. ఇప్పుడు ఆ నలుగురు ధర్మమునకు సేవలందించు చున్నారు. ధర్మ సేవలకు 1950 సం॥లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రిజయల్లాహు అన్‌హు వారిని పశ్చిమ ఆఫ్రికా పంపిరి. 1950 సం॥లో పశ్చమి, తూర్పు ఆఫ్రికా, హాలేండ్ కొరకు 8 ముబల్లిఘీన్లను పంపుట గురించి అహ్మదియ్యత్ చరిత్రలో వారి పేరు మొట్ట మొదట గలదు.

వారి గురించి వ్రాసిన కంటే ఎక్కువ విశిష్టతలు వారు కలిగివుండిరి. ఖిలాఫత్ పట్ల చాలా ప్రేమ, విధేయత కలిగివుండిరి. ఈ విషయములో గొప్ప ప్రామాణికము యుండెను. వారి సంతానమునుకు కూడ అల్లాహ్ తఆలా ఎల్లప్పుడు ఖిలాఫత్, జమాఅత్‌తో కలిసి వుండుటకు అనుగ్రహించుగాక! వారి స్థాయి అంతస్థులను పెంచుగాక! నమాజ్ తర్వాత నేను వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతును.

☆ ☆ ☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*